వృద్ధికి బీటలు

రెండేండ్ల కనిష్ఠానికి జీడీపీ పతనం

జూలై-సెప్టెంబర్‌లో 5.4 శాతమే • తయారీ, గనుల రంగాలు పేలవం • వినిమయ శక్తి బలహీనం

న్యూఢిల్లీ, నవంబర్ 29: దేశ ఆర్థిక వృద్ధి రేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి దిగజారింది. శుక్రవారం విడుదలైన జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) వివరాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో జీడీపీ 5.4 శాతానికే పరిమితమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 4.3 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ దరిదాపుల్లో వృద్ధి గణాంకాలుండటం ఇప్పుడే. కాగా, తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ఇది 6.7 శాతంగా ఉంటే.. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.1 శాతంగా ఉండటం గమనార్హం. దీంతో కాలం గడుస్తున్నకొద్దీ వృద్ధిరేటు అంతకంతకూ పడిపోతున్న సంకేతాలే కనిపిస్తున్నాయి.

తయారీ, గనులు నిరాశాజనకం..

తయారీ, గనుల రంగాల పనితీరు నిరాశాజనకంగా ఉన్నట్టు తాజా గణాంకాల్లో తేలింది. తయారీ రంగ కార్యకలాపాలు 2.2 శాతానికి, గనుల రంగంలో ఉత్పాదకతైతే 0.01 శాతానికి క్షీణించాయి. ఏడాది క్రితం ఇవి వరుసగా 14.3 శాతంగా, 11.1 శాతంగా ఉండటం విశేషం. రియల్టీ తదితర రంగాల్లో వృద్ధి పెరిగినా అది స్వల్పమే. ఇక వినియోగదారుల కొనుగోలు శక్తి సైతం పడిపోయినట్టు స్పష్టమవుతున్నది. ఈ ఏప్రిల్-జూన్‌లో 7.4 శాతంగా ఉంటే, జూలై-సెప్టెంబర్‌లో 6 శాతంగానే ఉన్నది. దేశ జీడీపీ బలంగా ఉండాలంటే మార్కెట్‌లో డిమాండ్ ముఖ్యం. కానీ వినిమయ శక్తి తగ్గిపోతే డిమాండ్ కూడా ఉండదు.

బేస్ ఇయర్ మార్పు!

జీడీపీ కంప్యూటేషన్ కోసం బేస్ ఇయర్‌ను 2022-23కు మార్చాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు యోచిస్తున్నది. అంతా కుదిరితే 2026 ఫిబ్రవరి నుంచి ఇది అమల్లోకి రావచ్చంటున్నారు. బేస్ ఇయర్ మారితేనే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి కచ్చితమైన సమాచారం వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కాగా, ప్రస్తుతం 2011-12 బేస్ ఇయర్‌గా ఉన్నది. ఈ సంవత్సరంలోని ధరల ఆధారంగానే వృద్ధి రేటును లెక్కిస్తున్నారు. గతంలో ఇది 2004-05గా ఉండేది. ఇదిలావుంటే వచ్చే జనవరి నుంచి నెలనెలా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే అంచనాలుంటాయని కేంద్ర గణాంకాలు, ప్రణాళిక అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్ తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికిగాను అక్టోబర్ నెల ముగిసే నాటికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక లోటు పూర్తి ఏడాదికాల లక్ష్యంలో 46.5 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఆదాయ-వ్యయాల మధ్య వ్యత్యాసాన్నే ఆర్థిక లోటుగా పరిగణిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దీన్ని రూ.16,13,312 కోట్లకు కట్టడి చేయాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే తొలి ఏడు నెలల్లో రూ.7,50,824 కోట్లకు వచ్చింది.

రెండో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 5.4 శాతానికి క్షీణించడం అసంతృప్తికరమే. అయినప్పటికీ మొత్తం ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 6.5 శాతం లక్ష్య సాధనకు వచ్చిన ముప్పేమీ లేదు.

-వీ అనంత నాగేశ్వరన్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు

జూలై-సెప్టెంబర్‌లో జీడీపీ వృద్ధిరేటు ఊహించినదాని కంటే బాగా తగ్గిపోయింది. కీలక రంగాల్లో నిస్తేజం కనిపించింది. తయారీ, గనుల రంగాల్లో ఉత్పాదకత రేటు మరీ దారుణంగా నమోదైంది.

-అదితి నాయర్, ఐసీఆర్ఏ ప్రధాన ఆర్థికవేత్త

మెప్పించని మౌలికం

బొగ్గు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తుల రంగాల్లో ఉమ్మడి వృద్ధిరేటు ఈ ఏడాది అక్టోబర్ నెలలో క్షీణించింది. 3.1 శాతంగానే ఉన్నట్టు తాజా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో ఈ 8 కీలక రంగాల ఉత్పాదకతలో వృద్ధిరేటు 12.7 శాతంగా నమోదు కావడం గమనార్హం. ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి క్షీణించినట్టు స్పష్టమైంది. కాగా, ఈ ఏప్రిల్-అక్టోబర్ మధ్య ఈ రంగాల వృద్ధిరేటు 4.1 శాతం వద్దే ఆగిపోయింది. నిరుడు ఇదే వ్యవధిలో 8.8 శాతంగా ఉన్నది. దేశ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండగా, వీటి పనితీరు ఐఐపీని గట్టిగానే ప్రభావితం చేస్తుంది.

విమానాల్లో బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు

20 శాతం వరకు ఎయిర్ ఇండియా ఆఫర్ • రూ.1,199కే ఇండిగో ప్రారంభ టికెట్

న్యూఢిల్లీ, నవంబర్ 29: విమాన ప్రయాణికులను ఆకట్టుకోవడానికి పలు విమానయాన సంస్థలు ప్రత్యేకంగా 'బ్లాక్ ఫ్రైడే సేల్స్' ఆఫర్లను ప్రకటించాయి. దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోతోపాటు ఎయిర్ ఇండియా ఈ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. దీంట్లో ఇండిగో ఒకవైపు ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,199గా నిర్ణయించింది. అంతర్జాతీయ రూట్‌లో రూ.5,199కే అందిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జనవరి 1 నుంచి మార్చి 31, 2025లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. అలాగే ఎయిర్ ఇండియా విమాన టికెట్ల బేస్‌రేట్‌పై 20 శాతం వరకు తగ్గింపు ధరకు విక్రయిస్తుండగా..అంతర్జాతీయ రూట్లపై 12 శాతం తగ్గింపునిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూన్ 30, 2025 లోపు ప్రయాణించాల్సి ఉంటుంది. భారత్ నుంచి ఆస్ట్రేలియా లేదా ఉత్తర అమెరికాల మధ్య మాత్రం అక్టోబర్ 30, 2025 లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని, లిమిటెడ్ సీట్లు ఉండగా, తొలుత వచ్చిన వారికి మాత్రమే ఈ ఆఫర్ లభించనున్నదని పేర్కొంది. ఈ ఆఫర్లు డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉండనున్నాయి.

సబ్బుల ధరలకు రెక్కలు

8% వరకు పెంచిన ఎఫ్ఎంసీజీలు • పామాయిల్ ధరలు పెరగడం వల్లనే..

న్యూఢిల్లీ, నవంబర్ 29: సబ్బుల ధరలకు రెక్కలొచ్చాయి. దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ సంస్థలు అన్ని రకాల సబ్బుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పామాయిల్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం వల్లనే వీటి ధరలను 7 శాతం నుంచి 8 శాతం వరకు పెంచాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, విప్రో సంస్థలు ప్రకటించాయి. సబ్బుల తయారీలో కీలక ముడి సరుకైన పామాయిల్ ధర అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమన్నది. దీంతో పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి సబ్బుల ధరలు పెంచకతప్పలేదని సంస్థలు పేర్కొన్నాయి. మార్జిన్లు తగ్గుముఖం పట్టడంతో వీటి ధరలను ప్రస్తుత త్రైమాసికంలో పెంచాల్సి ఉంటుందని గత త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు సందర్భంగా ప్రకటించాయి కూడా. సబ్బుల తయారీలో కీలక ముడిసరుకైన పామాయిల్ ధరలు గడిచిన ఏడాదికాలంలో 30 శాతం వరకు పెరిగాయని విప్రో కన్జ్యూమర్ కేర్ సీఈవో నీరజ్ ఖత్రియా తెలిపారు. మిగతా సంస్థలు కూడా తమ సబ్బుల ధరలను 7-8 శాతం వరకు పెంచుతాయని అనుకుంటున్నట్టు చెప్పారు. గడిచిన మూడు నెలల్లోనే పామాయిల్ ధరలు 35 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతోపాటు దిగుమతి సుంకం పెరగడం ఇందుకు కారణం. ప్రస్తుతం పది కిలోల పామాయిల్ ధర రూ.1,370గా ఉన్నది.

టీ పొడి ధరలు కూడా..

టీ పొడి ధరలు కూడా పెంచాయి సంస్థలు. అస్థిర వాతావరణ పరిస్థితుల కారణంగా టీ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్లనే ధరలు సవరించాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, టాటా కన్జ్యూమర్ సంస్థలు ప్రకటించాయి. టీ పొడి ధరలను 25 శాతం నుంచి 30 శాతం వరకు సవరించినట్లు టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్ ఇప్పటికే ప్రకటించింది కూడా.

- **విప్రో కన్జ్యూమర్ కేర్..సంతూర్, చంద్రిక పేర్లతో సబ్బులను విక్రయిస్తున్నది.**
- **హెచ్‌యూఎల్..డోవ్, లక్స్, లైఫ్‌బాయ్, లిరిల్, పీయర్స్, రెగ్జోనా బ్రాండ్లతో సబ్బులను అమ్ముతున్నది.**
- **లక్స్ సబ్బు (5 సబ్బులు) ప్యాక్ ధర రూ.145 నుంచి రూ.155కి పెరిగింది.**
- **లైఫ్‌బాయ్(5 సబ్బులు) ప్యాక్ విలువ రూ.155 నుంచి రూ.165కి పెంచారు.**
- **ఐదు ప్యాక్ కలిగిన పీయర్స్ సబ్బుల ధర రూ.149 నుంచి రూ.162కి సవరించారు.**

ఎన్‌సీసీకి 3,389 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, నవంబర్ 29: రాష్ర్టానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్‌కి మరో అతిపెద్ద ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. కెన్-బెట్వా లింక్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న రూ.3,389.49 కోట్ల విలువైన దౌధన్ డ్యామ్ ఆర్డర్ లభించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ భారీ ఆర్డర్‌కు సంబంధించి నిర్వహించిన బిడ్డింగ్‌లో సంస్థ తక్కువ కోట్ చేసి దక్కించుకున్నదని వెల్లడించింది. ఈ ఉత్తర్వులను వచ్చే 72 నెలల్లో(ఆరేండ్లలో) అమలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రాజెక్టునకు సంబంధించి ప్లానింగ్, డిజైనింగ్, ఇంజినీరింగ్, హైడ్రో-మెకానికల్ పనులు ఈపీసీ(ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్‌ట్రక్షన్) నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది.

బీఎండబ్ల్యూ బైకులు ప్రియం

న్యూఢిల్లీ, నవంబర్ 29: లగ్జరీ కార్ల సంస్థ బీఎండబ్ల్యూకి చెందిన ద్విచక్ర వాహన డివిజన్ బీఎండబ్ల్యూ మోటోరాడ్ కూడా తన వాహన ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1, 2025 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల ద్విచక్ర వాహన ధరలను 2.5 శాతం వరకు పెంచుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కారణంగా ధరలను పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

స్కిల్ వర్సిటీలో భాగస్వామ్యం కండి

విప్రో ప్రతినిధులతో శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విప్రో సంస్థ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో విప్రో కార్యకలాపాల పురోగతిని వివరించేందుకు ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి రాఘవ్ స్వామినాథన్ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విప్రో సంస్థకు అవసరమయ్యే వారికి స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చి నియమించుకోవాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఇదే తరహాలో 80 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల పరిశ్రమలను ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటు చేయాలని రాఘవ్‌ను కోరారు.

రూపీ.. ఆల్‌టైమ్ లో

ఒక్కరోజే 13 పైసలు పతనం • 84.60 వద్దకు మారకపు విలువ క్షీణత

ముంబై, నవంబర్ 29: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ శుక్రవారం ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. ఈ ఒక్కరోజే 13 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా భారతీయ కరెన్సీ 84.60 వద్దకు క్షీణించింది. దేశ జీడీపీ వృద్ధిరేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి పతనం కావడం.. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను అదేపనిగా ఉపసంహరించుకుంటుండటం ఓవరాల్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ఫారెక్స్ మార్కెట్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. దీనికితోడు దేశంలోని దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ కూడా రూపీని బలహీనపర్చిందని చెప్తున్నారు. నిజానికి ఇటీవలికాలంలో డాలర్ ముందు రూపీ వెలవెలబోతూనే ఉన్నది. ఒక్కరోజే 10 పైసలకుపైగా క్షీణించిన సందర్భాలు అనేకం ఉన్నాయంటే కరెన్సీ మార్కెట్‌లో రూపాయి ఎదుర్కొంటున్న ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. రూపాయి విలువ ఇలాగే పడిపోతే ఆ ప్రభావం.. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు, జీడీపీలపై గట్టిగానే పడవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

భారీ నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం కోలుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 759.05 పాయింట్లు లేదా 0.96 శాతం ఎగిసి 79,802.79 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 880.16 పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 216.95 పాయింట్లు లేదా 0.91 శాతం ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,131.10 వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, టెలీకమ్యూనికేషన్స్, ఎనర్జీ, టెక్నాలజీ షేర్లు రాణించాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.76 శాతం, మిడ్‌క్యాప్ 0.31 శాతం మేర పుంజుకున్నాయి. గురువారం సెన్సెక్స్ 1,190, నిఫ్టీ 361 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

తగ్గిన విదేశీ నిల్వలు

ముంబై, నవంబర్ 29: విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. ఇప్పటికే భారీ స్థాయిలో కరిగిపోయిన నిల్వలు ఈ నెల 22తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 1.31 బిలియన్ డాలర్లు తగ్గి 656.582 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 17.761 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడం వల్లనే రిజర్వులు తగ్గుతున్నాయని తెలిపింది. వీటి విలువ 3.043 బిలియన్ డాలర్లు తరిగిపోయి 566.791 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే గోల్డ్ రిజర్వులు మాత్రం 1.828 బిలియన్ డాలర్లు పెరిగి 67.573 బిలియన్ డాలర్లకు చేరాయి.

కాంగ్రెస్ హామీలను నిలబెట్టుకోవాలని ధర్నా

రెంజల్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

బోధన్/రెంజల్, నవంబర్ 29: కాంగ్రెస్ ఏడాది పాలనలో జరుపుకోవాల్సింది సంబురాలు కాదు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మికులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతి ఇస్తామన్న కాంగ్రెస్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్, రెంజల్ మండలాల్లో ధర్నా నిర్వహించారు. తహసీల్ కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే భారీ ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు.

తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయాన్ని అందిస్తున్న గ్రామపెద్దలు

మోర్తాడ్, నవంబర్ 29: ఆపదలో ఉన్న కుటుంబాన్ని రక్తసంబంధీకులే పట్టించుకోని పరిస్థితులు ఉన్న రోజుల్లో తోటి ఉద్యోగులు తమవంతు కృతజ్ఞతగా ఆర్థికసాయాన్ని అందించి ఆదర్శంగా చిలిచారు. కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామానికి చెందిన ఇబ్రహీంపట్నం భూమేశ్ ఉపాధికోసం కువైట్ వెళ్లాడు. అక్కడ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబం పరిస్థితి తెలిసిన కువైట్‌లోని పినిస్కో కంపెనీకి చెందిన తోటి ఉద్యోగులు నడుకుడ గ్రామానికి చెందిన జల గంగాధర్ రూ.52,500, మంత్రి తిరుపతి రూ.27,500, కోటూరి ధర్మప్రసాద్ రూ.11వేల ఆర్థికసాయాన్ని పంపించారు. మొత్తం రూ.91వేలను శుక్రవారం బాధిత కుటుంబానికి గ్రామస్తులు అందజేశారు. కార్యక్రమంలో గట్టు హన్మాండ్లు, సోమ భూమారెడ్డి, చెండల అశోక్, బద్దం బాలు, బాపురెడ్డి, కొండ నాగరాజు, మేకల రవీందర్ పాల్గొన్నారు.

మానవతా సదన్ తనిఖీ

డిచ్‌పల్లి, నవంబర్ 29: మండల కేంద్రంలోని మానవతా సదన్‌ను శుక్రవారంతహసీల్దార్ తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన అన్నం, పప్పు, మజ్జిగ, గుడ్లను పరిశీలించారు. అనంతరం పిల్లలతో మాట్లాడారు. వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ ఉన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

అడిషనల్ కలెక్టర్ అంకిత్

మోకన్‌పల్లి కేజీబీవీ, మోడల్ స్కూల్లో తనిఖీలు

నవీపేట, నవంబర్ 29: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, సిబ్బంది అలసత్వంతో ఫుడ్ పాయిజన్ అయితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ అంకిత హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, నవీపేట మోడల్ స్కూల్లో భోజన శాలలను తనిఖీ చేశారు. మోకన్‌పల్లి కేజీబీవీలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందజేయాలని పాఠశాల ప్రత్యేక అధికారిణి కవితకు సూచించారు. మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో సమగ్ర సర్వే డాటా ఎంట్రీని పరిశీలించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మోర్తాడ్, నవంబర్ 29: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని హెచ్ఎంలకు సూచించారు. హెచ్ఎం సాయన్న ఉన్నారు.

కేజీబీవీలో భోజనం తనిఖీ..

ఆర్మూర్‌టౌన్, నవంబర్29: పట్టణంలోని కేజీబీవీని మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేశారు. వండిన అన్నం, కూర, పప్పు నాణ్యతను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

నవీపేట మండలం మోకన్‌పల్లి కేజీబీవీలో భోజనాన్ని రుచి చూస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

ప్రోటీన్ల నిర్మాణంలో క్రయో ఎలక్ట్రానిక్స్ మైక్రోస్కోపి పాత్ర కీలకం

మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్ దాండ్లి

డిచ్‌పల్లి, నవంబర్ 29 : ప్రోటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపి పాత్ర ఎంతో కీలకమని అమెరికా నార్త్ కరోలిన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటప్రసాద్ దాండ్లి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'ప్రోటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రాన్ మైక్రో స్కోపి పాత్ర' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కీలక ఉపన్యాసకర్తగా హాజరైన డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. ప్రోటీన్ల ఛాయాచిత్రాలను తెలుసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తిని పెంచే అనేక రకాలైన డ్రగ్స్‌ను సులభంగా తయారుచేయవచ్చని తెలిపారు. పరిశోధక విద్యార్థులకు తక్కువ ఖర్చుతో క్రయో ఎలక్ట్రాన్‌ను ఉపయోగించి ఉపాధి అవకాశాలు ఎలా సృష్టించుకోవాలో వివరించారు. నిజ జీవితంలో క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్ ఉపయోగాలపై విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమగ్రంగా సమాధానమిచ్చారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నశీల, కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ సీహెచ్.ఆరతి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ మావూరపు సత్యనారాయణరెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జూమ్ లింక్ ద్వారా టీయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు వీక్షించారు.

మనోహరాబాద్‌లో పర్యటించిన వికారాబాద్ రైతులు

జక్రాన్‌పల్లి, నవంబర్ 29 : మండలంలోని మనోహరాబాద్ గ్రామాన్ని వికారాబాద్ జిల్లా బాకాపూర్, మేడికొండ, గంగుపల్లి గ్రామాలకు చెందిన 45 మంది రైతులు శుక్రవారం సందర్శించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జేఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నెలకొల్పడంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని జేఎంకేపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ పాటుకూరి తిరుపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దినేశ్, నివాస్, డైరెక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘం వివరాలను తెలుపుతున్న స్థానిక రైతులు

ప్రతిభను వెలికితీసేందుకే టెస్టులు

మోర్తాడ్/బాల్కొండ/రెంజల్, నవంబర్ 29: విద్యార్థుల ప్రతిభను గుర్తించడం కోసమే టాలెంట్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు కమ్మర్‌పల్లి మండల గణితఫోరం అధ్యక్షుడు కృష్ణకుమార్ అన్నారు. కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో మండలస్థాయి గణిత టాలెంట్‌టెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. కోనాసముందర్ ఉన్నత పాఠశాలకు చెందిన నిఖిల్ ప్రథమ, కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన శ్యామల, దేవీప్రియ ద్వియతీ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆంగ్ల మాధ్యమ విభాగంలో శభాసాదియా, గంగోత్రి, రష్మిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి బహుమతులను అందజేశారు. హెచ్ఎం రాజారామ్, వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో టీఎంఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి గణితం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, తెలుగు, ఇంగ్లిష్ మీడియం విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన తొమ్మిది మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వీరు డిసెంబర్ 11న నిర్వహించనున్న జిల్లాస్థాయి గణితం టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనాల్సి ఉంటుందని ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. రెంజల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో గణితఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి గణిత ప్రతిభ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన 9 మంది విద్యార్థులకు బహుమతులను గణిత ఫోరం ప్రతినిధులు అందజేశారు. ఎంఈవో కట్ట ఆంజనేయులు, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు తాళ్ల సోమలింగం గౌడ్, ఇన్‌చార్జి హెచ్ఎం భూమయప్పా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మోపాల్ మండల కేంద్రంలో..

ఖలీల్‌వాడి(మోపాల్), నవంబర్ 29: మోపాల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో టీఎంఎఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభా పోటీలను శుక్రవారం నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి (డిసెంబర్ 22)ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు నరేశ్‌కుమార్, శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాలాచారి , గణిత ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, భాగ్యలక్ష్మి, స్వప్న, చంద్రకళ, విద్యాసాగర్, రచన తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి తరగతులు ప్రారంభం

ఖలీల్‌వాడి, నవంబర్ 29: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ తరగతులు, పీజీ 1,2 సంవత్సర తరగతులు డిసెంబర్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, రీజినల్ కో-ఆర్డినేటర్ రంజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని, విద్యార్థులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7382929612, లేదా www.braouonline.in ను సంప్రదించాలని సూచించారు.

శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో సీనియర్ సవిల్ జడ్జి ప్రత్యేక పూజలు

రుద్రూర్, నవంబర్ 29: మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఆలయ పూజారి నారాయణ శర్మ, రాము శర్మ, ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, కర్క అశోక్ ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

బోధన్ రూరల్,నవంబర్ 29: తమను రెగ్యులర్ చేయాలని, పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం బోధన్ ఎంఈవో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు విజయ్, బాబు, శివనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాటు కోళ్ల పెంపకం కేంద్రం ప్రారంభం

బోధన్ రూరల్, నవంబర్ 29: బోధన్ మండలంలోని మినార్‌పల్లిలో శుక్రవారం నాటు కోళ్ల పెంపకం కేంద్రాన్ని డీఆర్‌డీవో సాయాగౌడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి సంబురాల్లో భాగంగా సాయి సుదా మహిళా సంఘంలోని సభ్యురాలు భాగ్యలక్ష్మి మదర్ యూనిట్‌ను ఏర్పాటుచేసుకున్నట్లు తెలిపారు. డీపీఎం రాచయ్య, ఏపీఎం వినోద్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వినాయక్‌నగర్, నవంబర్ 29: డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12మంది వాహనదారులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.వీరిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా నగరానికి చెందిన హుస్సేన్ బిన్ సలీంకు మూడు రోజులు, ఎల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన డిడి.రాజుకు రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. మిగతా తొమ్మిది మందికి రూ.25,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ వెల్లడించారు.

దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న స్నేహా సొసైటీ నిర్వాహకులు

ఖలీల్‌వాడి, నవంబర్ 29: దివ్యాంగులైనప్పటికీ ప్రతి విద్యార్థిలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని స్నేహా సొసైటీ నిర్వాహకులు, ఉపాధ్యాయ బృందం అన్నారు. జాతీయస్థాయిలో విజన్ ఎంపవర్‌మెంట్ ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌లో తమ పాఠశాలకు చెందిన ఆస్మా అనే అంధ విద్యార్థిని విత్తనాలు మొలకెత్తడమనే అంశంపై క్లుప్తంగా వివరించి జాతీయస్థాయిలో అవార్డులు కైవసం చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మారుతీనగర్‌లోని స్నేహా సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్య, వైస్‌ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.